క్లుప్తంగా

11న మేధావుల సంఘీభావ సభ

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు కోసం మేధావుల సంఘీభావ సభను 11న నిర్వహిస్తున్న సందర్భంగా గురువారం ఎంఈఎఫ్ జాతీయ ఈసీ మెంబర్ వందనమయ్య చేతుల మీదుగా ఎంఈఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ ప్రెసిడెంట్ దీపక్ ప్రజ్ఞ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తలారి వెంకటన్న, శేఖర్, జగ్గల ప్రభాకర్ యూత్ అధ్యక్షులు శేఖర్, కాంగ్రెస్ నాయకుడు పరమేష్‌నాయుడు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోకారమయ్య ఉర్సు

కేటీదొడ్డి: మండల పరిధిలోని కుచినెర్ల, నందిన్నె, కేటీదొడ్డి, గువ్వలదిన్నె గ్రామాల్లో గోకారమయ్య ఉర్సు ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. హిందూ, ముస్లింలు కలిసి నిర్వహించే ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. గ్రామస్తులు పొట్టేళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొత్తకుండలో దాసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కేటీదొడ్డి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు.. మండలంలోని చింతలకుంట గ్రామానికి చెందిన వ్యక్తి బల్గెర రోడ్డు వైపు నుంచి చింతలకుంటకు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి డ్రైవర్ మౌల, యజమాని గిరిధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎంపీకి వినతిపత్రాలు సమర్పించాలి

శాంతినగర్ : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఎంపీ శ్రీబాలయోగి ఉమేష్‌నాథ్ గురూజీకి వినతిపత్రాలు సమర్పించాలని వాల్మీకి సంఘ అలంపూర్ తాలూక ప్రధాన కార్యదర్శి పైపాడు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. శనివారం అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలకు ఎంపీ రానున్న నేపథ్యంలో వాల్మీకి సోదరులందరూ ఘన స్వాగతం పలికి వినతిపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి

మానవపాడు: బీజేపీ మానవపాడు మండల అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా జీ. మురళీకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ గెలుపునకు నిరంతరం కృషి చేస్తానన్నారు. యువకులు, మహిళల్లో చైతన్యం కలిగించి పంచాయతీ ఎన్నికల్లో అధిక సంఖ్యలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిడమిల్లిన మతసామరస్యం

అయిజ: జిల్లా వక్ఫ్ బోర్డ్ సభ్యుడు జమాలుద్దీన్ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం కుటుంబ సభ్యులతో కలిసి అయ్యప్ప స్వాములకు బిక్ష (అన్నదానం) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ముస్లిం సోదరులు కుల, మతాలకు అతీతంగా బిక్ష ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు తిరుమల్ గౌడ్, వీరశేఖర్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు

అయిజ: స్వామి వివేకానంద జయంతి వేడుకలు గురువారం మండల కేంద్రంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంకాపురం రాముడు, కోఆర్డినేటర్ పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో కలవరం

- కలుషితమవుతున్న మిషన్ భగీరథ తాగునీరు
- అనారోగ్యాలకు గురవుతున్న ప్రజలు.
- పట్టించుకోని పాలకులు, ప్రభుత్వం.



కారుపాకులలో నల్లా ద్వారా వస్తున్న కలుషిత నీరు



సాతర్లలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు చుట్టూ పేరుకున్న మురుగు

ఎర్రవల్లి: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గాను ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేయాల్సిన అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పైపులైన్లు లీకేజీలు కావడంతో పబ్లిక్ కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుంది. కలుషిత నీరు సరఫరా కావడంతో అనారోగ్యం బారిన పడుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

70,091 నల్లాలు..

అలంపూర్ నియోజకవర్గంలో 124 గ్రామ పంచాయతీల్లో 70,091 తాగునీటి నల్లాలు ఉన్నాయి. కానీ ఎక్కడ కూడా నీటి పరీక్ష కిట్లు సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో నీటి పరీక్షలు జరగడం లేదు. మరో గత్యంతరం లేక ప్రజలు డబ్బులు చెల్లించి మినరల్ వాటర్ వైపు మొగ్గు చూపుతున్నారు.

కలుషిత నీరు సరఫరా..

గ్రామీణ ప్రాంత ప్రజలకు పబ్లిక్ కుళాయిల ద్వారా శుద్ధ జలాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొంది. దీనిలో భాగంగా వేల కోట్లు ఖర్చుచేసి మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టింది. కానీ క్షేత్ర స్థాయిలో ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదు. నియోజకవర్గంలో ఎక్కడ కూడా నీటి పరీక్ష కిట్లు అందుబాటులో లేవు. దీంతో గ్రామాల్లో పైప్‌ల లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమవుతుంది. దీనికి తోడు నీటి సరఫరా కూడా సక్రమంగా అమలు కావడం లేదు. పలు గ్రామాల్లో రోజుకు రెండు మూడు బిందెల నీరు కూడా రావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పరీక్షలు మరిచిన అధికారులు..

ప్రతి గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నెలకోసారి పర్యటించి తాగునీటి పరీక్షలు చేయాల్సి ఉంటుంది. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటిని శాంపిల్ తీసుకొని ల్యాబ్‌కు పంపించాలి. పరీక్షలు నిర్వహించిన అనంతరం తాగడానికి అనువుగా ఉన్నాయా లేదా అని తేల్చి అట్టి సమాచారం గ్రామస్తులకు అందించాలి. కానీ ఏండ్లు గడుస్తున్నా పల్లెల్లో తాగునీటిని పరీక్షించిన దాఖలాలు కనపడటంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పలు గ్రామాల్లో ప్రజలు కలుషిత నీరు తాగి కలరా తదితర వ్యాధుల బారిన పడుతున్నారు.

ఆయా మండలాల వారీగా నల్లాల వివరాలు..

మండలం	జీపీలు	నల్లాలు
ఇటిక్యాల	29	13,492
మానవపాడు	16	7,252
ఉండవెల్లి	16	9,696
అలంపూర్	14	9,687
వడ్డేపల్లి	10	7,675
రాజోళి	11	8,245
అయిజ	28	14,044

నీటి పరీక్షలు చేయడం లేదు..



గ్రామంలో అధికారులు నీటి పరీక్షలు చేయడం లేదు. పంచాయతీలో అక్కడక్కడ పైపులైన్లు లీకేజీలు కావడం వల్ల అప్పుడప్పుడు కలుషిత నీరు సరఫరా అవుతుంది. దీంతో అప్పుడప్పుడు వ్యాధుల బారిన పడుతున్నాం. అధికారులు చెప్పినా చర్యలు తీసుకోవడం లేదు. – తెలుగు వీరేష్, ఎర్రవల్లి

నీరు కలుషితం కాకుండా చూస్తాం..



గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా కాకుండా తగుచర్యలు తీసుకుంటున్నాం. ప్రతి గ్రామంలో నెలలో ఒకటి, రెండు సార్లు ఖచ్చితంగా నీటి పరీక్షలు చేపడుతాం. – వంశీ కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఇటిక్యాల

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



అలంపూర్‌లో నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. అలంపూర్‌లోని పార్టీ కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నిక సమావేశం గురువారం నిర్వహించారు. బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో అలంపూర్ పట్టణ అధ్యక్షుడిగా కంపాటి భగత్ రెడ్డి, ఇటిక్యాల మండలాధ్యక్షుడిగా షేక్ అబ్దులా, మల్దకల్ మండలాధ్యక్షుడిగా నీలిపల్లి తిరుపతిరెడ్డి, ఎర్రవల్లి మండలాధ్యక్షుడిగా జగదీశ్వర్ రెడ్డి నియామకమయ్యారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు.

ఆదిశిలా క్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

మల్దకల్ : ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామిని గురువారం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు అర్చకులు మధుసూదనాచారి, రవిచారి ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి , ఓబీసీ రాష్ట్ర ప్రోగ్రాం కన్వీనర్ జంగం నాగమల్లయ్య, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. అలయ నిర్వహకులు అరవింద రావు, చంద్రశేఖర్‌రావు, బాబురావు, నాయకులు, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథా అరికట్టాలి..



రాజోళి బండ ఆనకట్టను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అయిజ : జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని షెటర్లు లేని మూడు వెంట్లను మూసివేయాలని బీఆర్ఎస్ నాయకుడు సంకాపురం రాముడు కోరారు. గురువారం బీఆర్ఎస్ నాయకులు కర్నాటకలోని రాజోలి బండ ఆనకట్టను సందర్శించారు. ఈసందర్భంగా రాముడు మాట్లాడుతూ.. ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు తాము సాగుచేసిన యాసంగి పటలకు సాగునీరు సరిపోక అనేక ఇబ్బందులకు గురవతున్నట్లు తెలిపారు.బుధవారం అధికారులు ఆర్డీఎస్‌కు ఒక టీఎంసీ నీటిని విడుదల చేశారని, ఆనకట్ట సమీపంలోని 100 మీటర్ల దూరంలో ఆర్డీఎస్ కాలువకు ఉన్న 3 వెంట్ల ద్వారా 30 శాతం నీరు వృథాగా బయటకు పోతుందన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వెంట్లను మూసివేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిన్న హనుమంతు, ఉమేష్ గౌడ్, భద్రయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అపార్ ఐడీ నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు : ప్రతి విద్యార్థికి విధిగా అపార్ ఐడీని నమోదు చేయాలని ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్ర బాబు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి పాఠశాలకు సంబంధించిన విద్యార్థులకు తప్పనిసరిగా అపార్ ఐడీ నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యత పాటించాలన్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీఓలు తదితరులు పాల్గొన్నారు.

అన్నకు తెలియకుండా.. తమ్ముడికి భూమి రిజిస్ట్రేషన్

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉండవెల్లి శివారుకు చెందిన 285 సర్వే నంబర్‌లోని 6 ఎకరాల భూమిలో అన్న మల్లేష్‌కు తెలియకుండా ధరణిలో భాగంగా అమ్మ పేరు మీద నుంచి నేరుగా తమ్ముడికి రిజిస్టర్ చేయించినట్లు బాధితులు వాపోయారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బాధితులు అధికారులను సంప్రదించగా 6 ఎకరాల భూమి ప్రభాకర్ రెడ్డి పేరు మీద ఉందని, అతను మరణించగా అతని భార్య హైమావతి పేరు మీదకు గిఫ్ట్ కింద రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. ఆమె 2020లో చిన్న కుమారుడు సురేష్ కుమార్ పేరు మీద రిజిస్టర్ చేయించినట్లు బాధితుడు పేర్కొన్నారు. ప్రజావాణిలో గతంలో కలెక్టర్‌కు మా భూమిని కొందరు అధికారులు డబ్బులు తీసుకుని మా తమ్ముడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారని ఫిర్యాదు చేసినట్లు మల్లేష్ తెలిపారు. రెండేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోయారు. తహసీల్దార్ హరికృష్ణను వివరణ కోరగా గతంలో రిజిస్ట్రేషన్ జరిగిందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

11న ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

అలంపూర్ : ఈనెల 11న జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు, మహా శివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక కరపత్రాల ఆవిష్కరణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ క్షేత్రంలో వెలిసిన శ్రీజోగుళాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఫిబ్రవరి 25వ తేది నుంచి మార్చి 1వ తేదీ వరకు శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక, కరపత్రాలు, శ్రీజోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలపై మక్కువ ఉండాలి

ఎర్రవల్లి: ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరికి క్రీడలపై మక్కువ ఉండాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైపీఎల్– 3 క్రికెట్ ముగింపు పోటీలకు ఆయన హాజరయ్యారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి మండలానికి మంచి పేరును తీసుకు రావాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన టీమ్ సభ్యులను అభినందించి కప్పుతో పాటు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటన్న, పెద్దలక్ష్మన్న, ఉమాపతినాయుడు, నాగరాజు, పరుశరాముడు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్‌కు రేపు ఎంపీ రాక



అలంపూర్ : ఈనెల 11న రాజ్యసభ ఎంపీ శ్రీబాలయోగి ఉమేష్‌నాథ్ గురూజీ అలంపూర్ క్షేత్ర ఆలయాలకు విచ్చేయనున్నట్లు ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి, ఆలయ ధర్మకర్త జగన్ మోహన్ నాయుడు, మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ కృష్ణయ్య సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంపీ 11న తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు అలంపూర్ క్షేత్రానికి చేరుకొని శ్రీజోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లి : మండల పరిధిలోని బీచుపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ గౌడ్ బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి గురువారం బీచుపల్లికి చేరుకొని రాజశేఖర్ భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు తోడుగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మహేష్, వీరబాబు, వినోద్, పరుశరాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎర్రవల్లి : ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నె గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. ఉత్సవాలల్లో భాగంగా రెండో రోజు సుప్రభాత సేవ, ద్వారతోరణం, ధ్వజ కుంభారాధనలు, కలశస్థాపన, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ట, ఆవాహిత దేవతా హోమాలు, లఘు పూర్ణాహుతి, నివేదన హారతి, తీర్థగోష్టి వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయులు, చైర్మన్ జయసింహా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, ప్రజలు పాల్గొన్నారు.

వర్గీకరణ ఉద్యమం ఉధృతం చేద్దాం



సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

అలంపూర్ : ఏబీసీడీ వర్గీకరణ అమలు చేసే వరకు ఉద్యమం ఉధృతం చేద్దాం ఎమ్మార్పీఎస్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ డప్పుస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని హరిత హోటల్‌లో నియోజకవర్గ కళాకారులు, ఎమ్మార్పీఎస్ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుస్వామి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో లక్ష డప్పులు వెయ్యి గొంతుకల కార్యక్రమానికి రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇంటికొక డప్పు తీసుకొని లక్షల డప్పులతో తరలి రావాలన్నారు. హైదరాబాద్ నడబొడ్డున లక్ష డప్పులతో మార్మోగించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జగ్గీవన్, మద్దిలేటి మాదిగ, సీనియర్ నాయకులు పెద్ద కృష్ణమాదిగ, రాజు మాదిగ, రాముడు మాదిగ, ఎంఈఎఫ్ నాయకులు వందనమయ్య, శ్రీనివాసులు, మొగలి రాజు, కృష్ణ, డప్పు కళాకారులు సురేష్, చంటి, సుధాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న కల్తీ కేటుగాళ్లు

- 200 కేజీల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

గద్వాల క్రైం: కల్తీకి కాదేది అనర్హం అన్నట్లుగా రెచ్చిపోతున్నారు కల్తీగాళ్లు. కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టుతో జేబులు నింపుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో పట్టణ ఎస్ఐ కల్యాణ్ కుమార్ సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడిలో భారీ మొత్తంలో కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. గత మంగళవారం రాత్రి పట్టణంలోని కుంటవీధిలో కల్తీ అల్లం , వెల్లుల్లి పేస్టు తయారు చేస్తున్నట్లు సమాచారం మేరకు సదరు దుకాణంలో పోలీసులు తనిఖీ చేపట్టారు. దాడిలో 200 కేజీలకు పైగా కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టును గుర్తించి స్టేషన్‌కు తరలించారు. తయారీదారుడిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం గంజిపేట్ కాలనీలో కల్తీ అల్లం, వెల్లుల్లి దుకాణాల్లో సోదాలు చేశారు. అల్లం, వెల్లుల్లితో పాటు కారం, ధనియాలు, కొబ్బరి తురుము సైతం కల్తీ చేస్తున్నట్లు గుర్తించారు. ప్రమాదకరమైన సిట్రిక్‌యాసిడ్, ఉప్పు, పసుపు, వెల్లుల్లి పొట్టును వినియోగిస్తూ కల్తీ పదార్థాలు తయారు చేస్తున్నారు. పలు రసాయనాలతో కూడిన పౌడర్, రంగు సంచులను పోలీసులు సీజ్ చేసినట్లు సమాచారం. కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలో కల్తీ పదార్థాలను వ్యాపారులు విక్రయిస్తున్నారన్నా ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. శాంపిల్స్‌ను ఫుడ్ కంట్రోల్ అధికారులకు అందజేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మాచర్లలో కలకలం.. పోలీస్ పికెట్ ఏర్పాటు



మస్తాన్ సైకిల్ షాపు దగ్గర పోలీస్ పహారా

గట్టు: మండలంలోని మాచర్లలో రెండు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదం చివరకు కత్తిపోట్లకు దారి తీసింది. స్నేహితుడు పిలిస్తే పంచాయతీకి వెళ్లిన పాపానికి రెండు కుటుంబాలకు సంబంధం లేని కర్ణాటకలోని రాయచూర్‌కు చెందిన ఖలందర్ (27) కత్తి పోటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే.

ఆన్‌లైన్ ద్వారా మాచర్లకు కత్తులు..

మాచర్ల గ్రామానికి చెందిన కొంత మంది యువకులు ఆన్‌లైన్ ద్వారా కత్తులు తెప్పించుకున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో సైకిల్ షాపు మస్తాన్ కుమారుడు మజ్జు కూడా ఆన్‌లైన్ ద్వారా కత్తిని తెప్పించుకున్నాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో ఖలందర్ (27)పై దాడి చేయడంతో అతడు మృతి చెందాడు. మృతుని సోదరుడు ఆశం ఫిర్యాదు మేరకు సైకిల్ షాపు మస్తాన్‌తో పాటుగా అతని కుమారుడు మజ్జులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు. హత్య జరిగిన నేపథ్యంలో మాచర్లలో సైకిల్ షాపు మస్తాన్, అల్లావుద్దీన్ ఇళ్లతో పాటు బల్గెర దారిలో ఉన్న మస్తాన్ సైకిల్ షాపు వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. రెండు కుటుంబాలు ఘర్షణకు దిగకుండా పోలీసులు పహారా కాస్తున్నారు.

వైకుంఠ ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు



ఉత్తనూరులో ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన ధన్వంతరి వేంకటేశ్వర స్వామి ఆలయం

అయిజ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఆలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని ధన్వంతరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో రజిత ఉత్తర వైకుంఠ ద్వారం ఏర్పాటు చేశారు. భక్తుల దర్శనానికి ఆలయాల కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

శాంతినగర్ : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయం, సీతారాముల వారి ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. తెల్లవారు జామున 4.30 గంటలకు దర్శనం ప్రారంభమవుతుందని, భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తరించాలని నిర్వాహకులు కోరారు.

ఏర్పాట్లు పూర్తి..

రాజోళి: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ఆలయాలు ముస్తాబయ్యాయి. మండల కేంద్రంలోని చారిత్రాత్మక వైకుంట నారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



పుటాన్‌దొడ్డిలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు

ఎర్రవల్లి : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామంలో కోదండాపురం ఎస్సై స్వాతి ఆధ్వర్యంలో ప్రజలకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు నియమాలు, చైల్డ్ లేబర్, మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలపై వివరించారు. మద్యం తాగి వాహనం నడపడం తీవ్ర నేరమన్నారు. అతిక్రమించిన వారికి రూ.10వేల వరకు జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో పోలీస్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజోళిలో..

రాజోళి: నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఎస్ఐ జగదీష్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రోడ్డు భద్రతా వారోత్సవాలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దస్తగిరి తదిదరులు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో..

ఇటిక్యాల : ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అలంపూర్ సీఐ రవి బాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని చాగాపురంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేష్, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

12 నుంచి శివాంజనేయ స్వామి ఉత్సవాలు

ఎర్రవల్లి : ఇటిక్యాల మండలం వావిలాల గ్రామంలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు శివాంజనేయస్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 12న ధ్వజారోహణం, 13న ఉపనయన సేవ, 14న అభిషేకం, రథోత్సవం, 15న పల్లకిసేవ, 16న స్వామి వారి జలక్రీడతో ఉత్సవాలు ముగియనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.